క్లుప్తంగా

ప్రభుత్వ విప్‌కు ఈ పంచాయతీ ఆపరేటర్ల వినతి



విప్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆపరేటర్లు

కథలాపూర్: గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేస్తున్న తమకు జూనియర్ అసిస్టెంట్ హోదా కల్పించి కనీస వేతనం అమలు చేయాలని మండలంలోని తాండ్ర్యాలలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా సౌకర్యం ఉండాలన్నారు. మహిళ ఆపరేటర్లకు ప్రసూతి సెలువులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మురళి, మౌనిక, మాధురి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పోస్టుకార్డు ఉద్యమం



సీఎంకు లేఖలు పంపిస్తున్న విద్యార్థినులు

జగిత్యాల: స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని డిగ్రీ విద్యార్థులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. దీనిలో భాగంగా శుక్రవారం సీఎంకు పోస్టు ద్వారా లేఖలు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్లుగా స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, పై చదువులకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ కళాశాలల అసోసియేషన్ మద్దతుతో పోస్టుకార్డులతో తమ బాధను తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, నలంద, చైతన్య విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి నమూనాలు సేకరణ

కథలాపూర్: మండలకేంద్రంలోని పలు వాడల్లో జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా తాగునీటి నమూనాలు సేకరణ గురువారం నిర్వహించారు. జల్ జీవన్ మిషన్ ప్రతినిధి మహబూబ్ గ్రామంలోని పలు వాడల్లో తిరిగి ఇళ్లలోకి వెళ్లి మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయిన నీటి నమూనాలు సేకరించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న నీటిని సేకరించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్, కార్యదర్శి సాయినాథ్, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

సదర్‌మాట్ నుంచి గంగనాలకు నీళ్లివ్వాలి



డీఈకి వినతిపత్రం ఇస్తున్న చైర్మన్ రాజన్న

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి గంగనాళ ప్రాజెక్టుకు సదర్‌మాట్ బ్యారేజీ గేట్లు ఎత్తి నీళ్లు ఇవ్వాలని గురువారం ఇరిగేషన్ డీఈ అశోక్‌కు సింగిల్‌విండో చైర్మన్ అంకతి రాజన్న, నాయకులు పెంట లింబాద్రి విన్నవించారు. గంగనాల ప్రాజెక్టు ఆయకట్టులో సుమారు 4 వేల ఎకరాలు సాగవుతుందని రైతుల పంట పొలాల్లో వరినాట్లు వేసే దశలోకి వచ్చాయని, సదర్‌మాట్ బ్యారేజీ వద్ద గేట్లు మూసి ఉండటంతో గంగనాల ప్రాజెక్టుకు సరిపడా నీళ్లు రావడం లేదని, వెంటనే సదర్‌మాట్ వద్ద గేట్లు ఎత్తి గంగనాల ప్రాజెక్టుకు నీళ్లు విడుదల చేయాలని విన్నవించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కోరుట్ల: పట్టణంలో స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగంగా గురువారం సీజనల్ వ్యాధులపై మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్, గంబూషియా చేపలు వేసి, ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ధనుంజయ, ఆశావర్కర్స్, అంగన్‌వాడీ టీచర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఇంటర్మీడియెట్ అధికారి

జగిత్యాల: జగిత్యాల జిల్లా ఇంటర్మీడియెట్ అధికారిగా వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబును కలిసి అభినందనలు తెలిపారు.

ఠాణాలో సగం మంది డెప్యూటేషన్లే



శిథిలావస్థలో ఉన్న పోలీసు క్వార్టర్స్

- రాయికల్ పీఎస్‌లో సిబ్బంది కొరత
- పోలీసులపై విధుల భారం
- శిథిలావస్థలో పోలీస్ క్వార్టర్స్



రాయికల్ పోలీస్‌స్టేషన్

రాయికల్: పట్టణంతో పాటు మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న పోలీసులపై డ్యూటీ భారం ఎక్కువవుతోంది. రాయికల్ ఠాణాలోని కానిస్టేబుళ్లంతా డెప్యూటేషన్లపైనే మరోచోట విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సిబ్బంది కొరతతో మండలంలో శాంతిభద్రతలు లోపిస్తున్నాయి. జిల్లాలోనే పెద్ద మండలమైన రాయికల్‌లో రాత్రిపూట విచ్చలవిడిగా గంజాయి సేవిస్తూ పోకిరీలు ద్విచక్ర వాహనాలపై వెళ్తూ పట్టణ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు.

14 మంది డెప్యూటేషన్లతో సిబ్బంది కొరత

రాయికల్ మున్సిపాలిటీతో పాటు, మండలంలోని 32 గ్రామాలు ఉండగా పోలీసుల రికార్డుల ప్రకారం 31 మంది రాయికల్ ఠాణాకు కేటాయించినట్లుగా ఉన్నారు. కాగా, ఇందులో సగం మంది వరకు డెప్యూటేషన్లపై ఇతర ఠాణాల్లో పనిచేస్తున్నారు. మొత్తం 31 మందిలో ఒకరు ఎస్సై, ఒకరు ఏఎస్సై, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, 13 మంది కానిస్టేబుళ్లు ఉండగా, 14 మంది కానిస్టేబుళ్లు జిల్లాలోని వివిధ ఠాణాల్లో డెప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఉన్న 13 మందిలో బ్లూకోర్ట్స్‌లో ఇద్దరు, రైటర్లు ఇద్దరు, రిసెప్షనిస్ట్ ఒకరు, ఐదుగురిని కేటాయించగా 8 మందిని 32 గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వహిస్తున్నా రు. అంతేకాకుండా ఠాణాలో ఉన్న పోలీసు క్వార్టర్స్ సైతం దశాబ్దాల క్రితం నిర్మించినవి ఉండటంతో శిథిలావస్థకు చేరాయి. దీంతో చాలా మంది సిబ్బంది మరో చోట అద్దెకు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ స్పందించి డెప్యూటేషన్‌పై వెళ్లిన కానిస్టేబుళ్లను రాయికల్ ఠాణాకు కేటాయించాలని కోరుతున్నారు.

సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది



రాయికల్ ఠాణాలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లాం. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఉన్న సిబ్బందితో పనిచేస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

– అశోక్, ఎస్సై, రాయికల్

బయట ఫుల్, లోపల నిల్



జగిత్యాలటౌన్: పట్టణంలోని విద్యానగర్ మున్సిపల్ మార్కెట్లో రైతులు, అమ్మకందారులు రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. దీంతో ధామాటాకీస్ వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్, ఫైరింజన్ వెళ్లే పరిస్థితి కూడా లేని దుస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మున్సిపల్ మార్కెట్ వృథాగా మారిందని, అధికారులు మార్కెట్ లోపల విక్రయాలు జరిపి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346639

పాత్రికేయులకు న్యాయం జరిగేలా చూస్తా

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



దీక్షలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

జగిత్యాలటౌన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించే బాధ్యత తమపై ఉందని వారికి న్యాయం జరిగేలా చూస్తానని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఇళ్ల స్థలాలు కేటాయించాలని జగిత్యాల ఆర్డీవో కార్యాలయం వద్ద పాత్రికేయులు చేపట్టిన నిరవధిక నిరసనలో గురువారం పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ అర్హులైన ప్రతి పాత్రికేయుడికి ఇళ్ల స్థలం మంజూరుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, శోభరాణి, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుకు మద్దతుగా ఎంపీ లేఖ

రాష్ట్ర ఏర్పాటులో జర్నలిస్టుల పాత్ర వెలకట్టలేనిదని, జర్నలిస్టులకు రాజ్యాంగ హక్కుగా దక్కాల్సిన ఇళ్ల స్థలాల విషయంలో నాటి కేసీఆర్, నేటి రేవంత్ ప్రభుత్వాలలో తీరని అన్యాయం జరిగిందని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల కోసం నిరసన చేపట్టిన జర్నలిస్టులకు మద్దతుగా లేఖ రాశారు. పార్లమెంట్ సమావేశాల కారణంగా రాలేక పోతున్నానని, జర్నలిస్టుల నిరసనకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, భవిష్యత్‌లో అండగా ఉంటానని లేఖలో పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో నిరుపేదలకు భరోసా

మెట్‌పల్లిరూరల్: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందిన పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో భరోసానిస్తుందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో 65 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయిరెడ్డి, తిరుపతిరెడ్డి, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీరాజం సేవలు మరువ లేనివి



నివాళి అర్పిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల: బీఆర్‌ఎస్ నాయకుడు పోగుల లక్ష్మీరాజం సేవలు మరువలేనివని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావులు అన్నారు. పట్టణంలోని పీబీ గార్డెన్స్‌లో లక్ష్మీరాజం ప్రథమ వర్ధంతి సభకు హాజరై నివాళి అర్పించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, ఎస్పీ, చైర్‌పర్సన్

జగిత్యాలరూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పరేడ్ మైదానంలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, లక్ష్మణ్, అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీ రఘుచందర్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్ శ్రీలత, సీఐ కృష్ణారెడ్డి, ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెరిట్ అభ్యర్థులను భర్తీ చేయాలి

జగిత్యాల: గురుకుల ఉపాధ్యాయ నియమకాల్లో డిసెండింగ్ ఆర్డర్ చేపట్టాలని గురుకుల పోస్టుల మెరిట్ జాబితా అభ్యర్థులు అన్నారు. గురువారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఒకటి కన్నా ఎక్కువ ఉద్యోగాలు రావడంతో దాదాపు 2500 పోస్టులు భర్తీ కాకుండా మిగిలిపోయే పరిస్థితి ఏర్పడిందని, మిగతా పోస్టులకు తదుపరి మెరిట్ జాబితా అభ్యర్థులతో భర్తీ చేసేలా చూడాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఆస్పత్రి ప్రారంభం

జిల్లా కేంద్రంలోని తిరుమల మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, ఐఎంఏ అధ్యక్షుడు సురేశ్, అజయ్, కౌన్సిలర్ నారాయణ పాల్గొన్నారు.

నియామకం

కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుల నియామకం

కథలాపూర్: కాంగ్రెస్ సేవాదళ్ కథలాపూర్ మండలాధ్యక్షుడిగా బొమ్మెన గ్రామానికి చెందిన పంజాల సత్యనారాయణగౌడ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు అందె మారుతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

గొల్లపల్లి: మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులను గురువారం కాంగ్రెస్ సేవాదళ్ ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు నీలకంఠేశ్వర్ ఆధ్వర్యంలో నియమించారు. మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన దాసారపు సదానందం నియమించారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ, నియోజకవర్గం కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు అందే మారుతి, నియోజకవర్గ అధ్యక్షుడు చొప్పదండి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల గ్రామ శివారుల్లో రూ. 10 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయానికి సారంగాపూర్ గ్రామానికి చెందిన పుల్లూరి లక్ష్మీనారయణ–జ్యోతి దంపతులు రూ. 51 వేల విరాళం అందజేశారు. దాతలను ఆర్యవైశ్యసంఘం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల అధ్యక్షులు మర్యాల రాజన్న, గుండ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలు వీడాలి

పెగడపల్లి: మూఢ నమ్మకాలను విశ్వసించి మోసపోవద్దని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేశ్ అన్నారు. మండలంలోని సుద్దపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ నివారణ–మూఢ నమ్మకాల నిర్మూలన అంశంపై గురువారం అవగాహన కల్పించారు. వివిధ ప్రదర్శనలు చేసి విద్యార్థులు, ఉపాధ్యా యులను అబ్బుర పరిచారు. హెచ్‌ఎం శాంతమ్మ, పంచాయతీ కార్యదర్శి నదీం హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళను మోసగించిన వ్యక్తిపై కేసు

మల్యాల: మహిళను వివాహం చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై మల్యాల పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలలోని తాటిపల్లి గ్రామానికి చెందిన మహిళను చొప్పదండి గ్రామానికి చెందిన చిట్టిపాక విక్రమ్ అనే వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మించి, తర్వాత పెళ్లి చేసుకోకుండా కుటుంబ సభ్యులతో కలిసి మోసం చేయడంతో చొప్పదండి పోలీస్ స్టేషన్‌లో చిట్టిపాక విక్రమ్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గురువారం మల్యాల పోలీస్‌స్టేషన్‌లో తిరిగి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మేడిపల్లిలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు గురువారం దాడులు చేశారు. మొత్తం ఏడుగురు పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు.వారి వద్ద నుండి రూ.30 వేలకు పైగా నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

దాడి చేసిన వ్యక్తిపై..

సారంగాపూర్: అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి ఇద్దరిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం మండలంలోని మ్యాడారంతండా శివారు గ్రామం తలుపులగూడెం తండాకు చెందిన మోతె ఎల్లవ్వ, ఆమె భర్త చిన్నపాషంల ఇంటిలోకి బుధవారం రాత్రి పది గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన పిట్టల రాజు అక్రమంగా ప్రవేశించి, అకారణంగా కర్రతో ఇద్దరిపై దాడి చేసి కొట్టాడు. బాధితురాలు ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వచ్ఛదనం–పచ్చదనం ప్రతి ఒక్కరి బాధ్యత

జగిత్యాలరూరల్: స్వచ్ఛదనం–పచ్చదనం ప్రతి ఒక్కరి బాధ్యత అని జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్‌సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరీటి, కారోబార్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

కోరుట్ల: పర్యావరణ సమతుల్యానికి మొక్కలు నాటలని పీవీ నర్సింహారావు వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ దాసరి శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో మొక్కలు నాటారు.ర్యక్రమంలో కళాశాల ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అంబిక, పరశురాములు, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి:స్వచ్ఛదనం–పచ్చదనంపై తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వెటర్నరీ, మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీవో మహేందర్, హెచ్‌ఎం లలిత, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి: గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా బహిరంగ ప్రదేశాలు వీధులు, ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్ అధికారులకు సూచించారు. పెగడపల్లిలో గురువారం ఆయన పర్యటించి స్వచ్ఛదనం–పచ్చదనంలో చేపట్టిన పారిశుధ్య పనులు పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, డాక్టర్ అనూషా, వైద్య సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

గొల్లపల్లి: స్వచ్ఛదనం– పచ్చ దనంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్ అన్నారు. మండలంలోని రాఘవపట్నం గ్రామాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు పచ్చదనం, పరిసరాలు పరిశుభ్రంపై అవగాహన కల్పించారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని మండలంలోని తిమ్మాపూర్, వేములకుర్తి, ఎర్దండి, కేశాపూర్ గ్రామాల్లో గురువారం ఎంపీవో చంద్రశేఖర్ పారిశుధ్య పనులు పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టీచర్ల సర్వీస్ రూల్స్ సాధిస్తాం

మేడిపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లోని ఉపాధ్యాయులతో పీఆర్టీయూ తెలంగాణ సభ్యత్వం చేయించినట్లు జిల్లా అధ్యక్షుడు గాదె నర్సింగరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి ఎన్నో యేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్ రూపొందించి అమలు చేయిస్తామని తెలిపారు.కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశపక్ హుస్సేన్, ప్రదాన కార్యదర్శి నరుకుట్ల శ్రీదర్, మీడియా సెల్ కన్వీనర్ రాజు జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

రాయికల్:ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం పోరాటం చేస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి గురువారం రాయికల్ మండలంలోని అల్లీపూర్, ఇటిక్యాల, భూపతిపూర్, కొత్తపేట, మైతాపూర్, కిష్టంపేట గ్రామాల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రమేశ్, జిల్లా కార్యదర్శి బోయినిపల్లి ఆనందరావు, కన్నవేని మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు రాపర్తి నర్సయ్య, నాయకులు గుర్రం శ్రీనివాస్, దొంతి సతీశ్, రాము, సతీశ్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

కథలాపూర్: మండలంలోని పోతారం, గంభీర్‌పూర్ గ్రామాల్లో ఎరువులు విక్రయించే దుకాణాలను ఏవో యోగితా గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఎరువుల నిల్వల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆమె వెంట సీఈవో విజయ్ ఉన్నారు.

విద్యా వలంటీర్లను నియమించాలి

మెట్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొమిరెడ్డి కరం గురువారం కోరారు. పదవీ విరమణ, లాంగ్ లీవ్‌ల వంటి కారణాల వల్ల ఖాళీలు ఏర్పడుతాయని, వీరి స్థానంలో విద్యా వలంటీర్లను నియమించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీ పోస్టుల వల్ల విద్యార్థులకు బోధనపరంగా నష్టం జరుగుతోందన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ

మెట్‌పల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థానిక నితిన్ చారిటబుట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం సౌండ్ సిస్టం వితరణ చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ ఆనంద్‌బాబు దీనిని హెచ్‌ఎం నారాయణకు అందజేశారు. పేద విద్యార్థులను ఆదుకుంటానన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వినోద,ఉపాధ్యాయులు ఉన్నారు.

కోనోకార్పస్ మొక్కలు తొలగించండి

మేడిపల్లి: కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని కొండాపూర్‌లో బీజేపీ నాయకులు కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి మేకల రాజు,మండల ఐటీ సెల్ కన్వీనర్ నీలం గంగాధర్, వడ్లగడ్డ గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సా లెజండరీ అవార్డుకు సంతోష్

రాయికల్: పట్టణంలోని ప్రముఖ సామాజిక సేవకుడు సదుళ్ల సంతోష్ సేవలకు గాను మదర్‌థెరిస్సా లెజండరీ అవార్డుకు ఎంపిక చేసినట్లు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకురాలు సరోజనమ్మ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 10న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా అవార్డు అందుకోనున్నారు.

సంక్షిప్త వార్తలు

ఇంటింటా జ్వరసర్వే

రాయికల్: స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగంగా పట్టణంలో గురువారం ఇంటింటా జ్వర సర్వే చేపట్టారు. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది ఇంటింటా జ్వర సర్వే నిర్వహిస్తూ డెంగీ, మలేరియా బారిన వారి వివరాలు సేకరించి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిలర్లు అన్వరిబేగం, మహేశ్‌గౌడ్, మేనేజర్ వెంకటి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌చెక్కు అందజేత

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన రాజారం అనే వ్యక్తికి ఎమ్మెల్సీ ఎల్.రమణ చొరవతో రూ.36 వేల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు మంజూరు కాగా, గురువారం బాధితుడికి బీఆర్‌ఎస్ నాయకులు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నీరటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్య వైద్య శిబిరం

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో గురువారం వృద్ధాప్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాత శిశు సంరక్షణ జిల్లా అధికారి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ వృద్ధాప్యంలో దీర్ఘకాలిక వ్యాధులైన మోకాళ్లనొప్పులు, కీళ్లనొప్పులు, కడుపులో మంట, మలబద్ధకం, దగ్గు, దమ్ము వంటి వ్యాధులతో బాధపడుతున్నారని, వారికి చికిత్స కోసమే ఆయూష్ ఆధ్వర్యంలో వృద్ధాప్య వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని సుమారు 200 మంది వృద్ధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ న్యాయవాదులు గురువారం తమ విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. జనగామ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులపై స్థానిక పోలీసు అధికారుల దాడులకు నిరసనగా కోర్టులో విధులు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బు లక్ష్మారెడ్డి ,ప్రధాన కార్యదర్శి భూమి రమణ కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె

ధర్మపురి: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు నల్ల సునీత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని మండలంలోని నక్కలపేటలో గురువారం బైఠాయించి ఒక్క రోజు టోకెన్ సమ్మెను చేపట్టారు. కార్యక్రమంలో కార్మికులుపాల్గొన్నారు.

మల్యాల: తమ హక్కుల సాధన కోసం పారిశుధ్య కార్మికులు ఒక్కరోజు సమ్మెకు దిగారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను బహిష్కరించి, మండల పరిషత్ కార్యాలయం సమీపంలో దీక్ష చేపట్టారు. తమ వేతనాలు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోరెపు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రోల్లవాగు మెయిన్ కాల్వకు బుంగ



కాల్వకు బుంగపడి వృథాగా పోతున్న నీరు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రోల్లవాగు ప్రాజెక్టు దిగువన ఆర్‌వీ మెయిన్ (రోల్లవాగు మెయిన్) కాల్వకు బుంగ పడి నీరు వృథాగా పోతోంది. రోల్లవాగు ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న పంట పొలాలకు వచ్చే ప్రధాన కాలువ బీర్‌పూర్ గ్రామ బస్టాండ్ సమీపం ఎగువన వర్షాలకు వస్తున్న నీటితో పెద్ద బుంగ పడి కాలవ లైనింగ్, మట్టి కోతకు గురికావడంతో బుంగ మరింత ప్రమాదకరంగా మారింది. రోల్లవాగు ప్రాజెక్టు నుంచి త్వరలో దిగువన వర్షాకాలం పొలాలకు నీటిని విడుదల చేసే సమయంలో కాలువకు బుంగపడడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.